# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-25-ఫిబ్రవరి-2026 | సంపుటి : 3 | సంచిక : 268 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## మురారిపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితిపై ఈటల ఆగ్రహం

- ఐదోసారి సందర్శించిన ఎంపీ
- మౌలిక సదుపాయాల లేమిపై తీవ్ర విమర్శలు
- వారంలో సమస్యలు పరిష్కరించాలన్న హెచ్చరిక



2లో

## బీసీ రిజర్వేషన్లపై స్పష్టత తర్వాతే

# జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

### కేంద్రంలో పెండింగ్‌లో బిల్లు.. కేబినెట్ భేటీలో కీలక చర్చ

### నిర్ణయం వచ్చేంత వరకు ఎన్నికల ప్రక్రియ వాయిదా




**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉండటంతో, దానిపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మంచి విజయాన్ని సాధించింది. అనేక మున్సిపాలిటీలలో, కార్పొరేషన్లలో మెజారిటీ స్థానాలను దక్కించుకుని జోరు కొనసాగిస్తోంది. ఇదే ఊపులో పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాలని పార్టీ వర్గాలు భావించినప్పటికీ, బీసీ రిజర్వేషన్ల పెంపు ఎన్నికల హామీ కావడంతో ప్రభుత్వం ఆ అంశానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ తీర్మానం, బిల్లును ఇప్పటికే కేంద్రానికి పంపామని పేర్కొన్నట్లు సమాచారం. కేంద్రం నుంచి ఎలాంటి నిర్ణయం వస్తుందో వేచి చూడాలని, అనంతరం పరిషత్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి అభిప్రాయానికి మంత్రులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. దీంతో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం నుంచి అనుమతి వచ్చే వరకు తెలంగాణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానే అవకాశాలు కనిపించడం లేదు.



## మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- మంత్రివర్గం నిర్ణయించిన షెడ్యూల్
- తొలి రోజు గవర్నర్ ప్రసంగం
- మార్చి 20న 2026–27 బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు

2లో



## రూ. 547 కోట్ల సైబర్ మోసం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

- 14 మంది అరెస్ట్..
- విదేశీ కాల్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ మోసాలు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ వసుంధర యాదవ్

2లో



## అంబర్‌పేటలో విషాదం...

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- ఆర్థిక ఇబ్బందులే కారణమా? పోలీసుల అనుమానం
- తల్లిదండ్రులతో పాటు కుమారుడు ఆత్మహత్య

2లో

## ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రమాద బీమా అమలు

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సంఘాల నాయకులు

2లో



# భూదాన్ వివాదం రగిలింది

### వేలాది పోలీసులతో భారీ మోహరింపు.. వెలగుమట్ల వినోబా నగర్‌లో కూల్చివేతల సన్నాహాలు..

### మీడియా ప్రవేశానికి ఆంక్షలు, బాధితుల ఆవేదన

2లో

## తెలంగాణ విమానాశ్రయ ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష

- కేంద్ర పౌర విమానయాన మంత్రితో భేటీ
- వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి ప్రాజెక్టుల పురోగతిపై చర్చ
- నియమిత సమీక్ష సమావేశాలకు నిర్ణయం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో కొనసాగుతున్న పలు విమానాశ్రయ ప్రాజెక్టులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లి విమానాశ్రయాల అభివృద్ధి పనుల పురోగతిపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, అనుమతులు వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించారు. ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి కావాలంటే కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుల పురోగతిని సమయానుకూలంగా పర్యవేక్షించేందుకు నియమిత సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి అమలు ప్రక్రియను వేగవంతం చేయడంపై దృష్టిసారించాలని ఇరువురు మంత్రులు అంగీకరించారు. తెలంగాణలో విమానాశ్రయ మౌలిక వసతులు అభివృద్ధి చెందితే ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని కిషన్ రెడ్డి తెలిపారు.

## డీజీపీ ఎదుట లొంగిపోయిన

# మావోయిస్టు అగ్రనేతలు

### నలుగురు కీలకనేతలు దేవ్‌జీ, మల్లారాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డి లొంగుబాటు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న కూడా లొంగుబాటు చేసినట్లు డీజీపీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మురారిపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితిపై ఈటల ఆగ్రహం



**మురారిపల్లి, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మురారిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్ అక్కడి పరిస్థితులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇళ్లను పరిశీలించిన ఆయన అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇది తాను ఐదోసారి ఇక్కడికి వస్తున్నానని పేర్కొంటూ, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా చలనం లేదన్నారు. ఇళ్లలో విద్యుత్ సదుపాయం లేదని, మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, లిఫ్టులు పనిచేయకపోవడం, సివిల్ పనులు పెండింగ్‌లో ఉండటం వంటి సమస్యలను ప్రస్తావించారు. రవాణా సౌకర్యం కూడా సరిగా లేక ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు ఇచ్చినా నివాసానికి అనుకూలంగా లేకపోతే దాని ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇళ్లు అప్పగించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారంలోగా అన్ని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు గడువు విధించారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బాధితులకు అండగా ఉంటానని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# రూ. 547 కోట్ల సైబర్ మోసం కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్



**సత్తుపల్లి, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** రూ.547 కోట్ల భారీ సైబర్ మోసం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. జనవరి 11న వీయం బంజర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు ఉడతనేని వికాస్ చౌదరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకోగా, మరో 8 మంది పరారీలో ఉన్నారని వెల్లడించారు.

మంగళవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం అడపా రామ వెంకట చరణ్ చౌదరిని సత్తుపల్లి బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం లభించిందన్నారు. అతను ఇచ్చిన వివరాల ఆధారంగా అదే రాత్రి మరో 12 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో నిందితులు 2020 నుంచి ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, స్టాక్ మార్కెట్, క్రిప్టో ట్రేడింగ్, మ్యాట్రిమోనీ, ఓటీపీ మోసాల పేర్లతో ప్రజలను మభ్యపెట్టి డబ్బులు దోచుకున్నట్లు గుర్తించారు. బాధితులను టెలిగ్రామ్ గ్రూపులకు చేర్చి నకిలీ లింకులు, క్యూఆర్ కోడ్లు పంపించి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు మళ్లించినట్లు చెప్పారు. నేర సొమ్ము మార్పిడికి 22 మంది పేర్లపై బ్యాంక్ ఖాతాలు తెరవించి వాటి ద్వారా డబ్బులు బదిలీ చేసినట్లు వెల్లడించారు. కరెంట్ ఖాతాలు తెరవించేందుకు వ్యక్తులకు నెలకు రూ.50 వేల వరకు జీతం, ఖాతా తెరిచిన వారికి రూ.10 వేల వరకు చెల్లింపులు చేసినట్లు విచారణలో తేలింది.

*అరెస్టైనవారు* : ఉడతనేని వికాస్ చౌదరి, అడపా రామ వెంకట చరణ్ చౌదరి, అడపా సూర్య వెంకట తరుణ్, ఇలాసారపు అనిరుధ్, పోట్రు వంశీ, పోట్రు చైతన్య సాయి, దోసపాటి నవీన్, నల్లబోతుల భవాని సత్యశేఖర్, కాపుగంటి జోగేంద్ర శేషు, దేవళ్ళ వేణు, మామిడిశెట్టి సాయి కుమార్, పటాన్ ఇమ్రాన్ ఖాన్, ఉప్పతల గోపి, దొబ్బల వెంకటేష్.

*పరారీలో ఉన్నవారు* : బొప్పన నాగప్రియ, ఇస్లావత్ లక్ష్మి కళ్యాణ్, శీలం వేణుగోపాల రావు, నల్లంగుల శ్వేతన, వీరం శెట్టి వంశీ, బిల్లా సాయి తరుణ్, సంగం ప్రవీణ్ కుమార్, భూక్యా తరుణ్. ఈ ముఠా విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ పెట్టుబడులు, గేమింగ్, బెట్టింగ్, రివార్డు పాయింట్లు, షేర్ మార్కెట్, క్రిప్టో ట్రేడింగ్ పేర్లతో ప్రజలను మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ముందుగా ఏజెంట్ల ద్వారా తెరవించిన ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి, అనంతరం పలు ఖాతాల ద్వారా మార్పిడి చేసి చివరకు వ్యక్తిగత ఖాతాల్లోకి చేర్చి డాలర్లు, క్రిప్టో కరెన్సీగా మార్చినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు తరువాత వెల్లడిస్తామని ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రమాద బీమా అమలు

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సంఘాల నాయకులు
- రూ.1.20 కోట్ల ప్రమాద బీమా, రూ.1,056 కోట్ల మూలనిధితో ఆరోగ్య పథకం
- 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స సౌకర్యం



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు): ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య పథకం మరియు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ దశాబ్దాల కోరికను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన నిర్ణయాలపై ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపజేయడం, రూ.1,056 కోట్ల మూలనిధితో ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకం ద్వారా 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించడం ఉద్యోగ వర్గాలకు పెద్ద ఊరటనిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గం ఉద్యోగ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ సంకల్పం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక భారం లేకుండా వైద్య సేవలు పొందగలరని అభిప్రాయపడ్డారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐకాస నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి. దామోదర్ రెడ్డి, చావా రవి, కే. వెంకటేశ్వర్లు, ఉపేందర్ రెడ్డి, జి. సదానంద గౌడ్, ఉమాదేవి, వి. రవీందర్ రెడ్డి, గిరి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్, టి. లక్ష్మన్, వి. లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్. రాములు, రమేష్ పాక, సీహెచ్. శ్రీనివాస్, బాణాల రాంరెడ్డి, వి. భిక్షం, డా. నిర్మల, ఎల్. దశరథ్, గరికె ఉపేందర్ రావు, సుగంధిని, భూమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

(మొదటి పేజీ తరువాయి)



గత రెండేళ్లలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది డివిజన్ కమిటీ సభ్యులు, 85 మంది ఏరియా కమిటీ సెక్రటరీలు, 60 మంది పార్టీ సభ్యులు సహా మొత్తం 591 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారని డీజీపీ తెలిపారు. తెలంగాణలో పుట్టి పెరిగిన మరో 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో కొందరితో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు, పునరావాస ప్రయోజనాలు వెంటనే అందిస్తామని అధికారులు తెలిపారు. కేంద్ర కమిటీ సభ్యులైన దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి, రాష్ట్ర కమిటీ సభ్యులైన దామోదర్, గంగన్నలకు రూ.20 లక్షల చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర పునరావాస పథకాల ప్రకారం వారికి మొత్తం రూ.90 లక్షల వరకు లభించే అవకాశం ఉందని వెల్లడించారు.

లొంగుబాటులో కీలక పాత్ర పోషించిన ప్రత్యేక నిఘా విభాగ అధికారులను డీజీపీ అభినందించారు. ప్రధాన ప్రవాహంలోకి వచ్చిన మావోయిస్టుల హక్కులను కాపాడుతామని, వారి భద్రతకు పూర్తి హామీ ఇస్తామని స్పష్టం చేశారు. హింస మార్గం వదిలి సాధారణ జీవన విధానాన్ని ఎంచుకోవడం సానుకూల పరిణామమని డీజీపీ వ్యాఖ్యానించారు.

# ట్యాంక్‌బండ్‌పై ఆత్మహత్యాయత్నం అడ్డుకున్న పోలీసులు

- కుటుంబ కలహాలతో మహిళ తీవ్ర మనస్తాపం
- ఇద్దరు కుమారులతో హుస్సేన్‌సాగర్‌లో దూకేందుకు యత్నం
- అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులు ప్రాణాలు కాపాడారు



**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఘటన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై చోటుచేసుకుంది. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తంగా స్పందించడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి. జియాగూడ ఎంసీహెచ్ కాలనీకి చెందిన బి. ప్రతివ (28) తన కుమారులు అనిష్ (10), జస్వంత్ (7)తో కలిసి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. తెలంగాణ అమరవీరుల స్థూపం సమీపంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని ప్రశ్నించారు. విచారణలో భర్తతో తరచూ గొడవలు జరుగుతున్నాయని, విసిగిపోయి పిల్లలతో కలిసి హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించింది. వెంటనే స్పందించిన పోలీసులు తల్లీకుమారులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య ఆమె సమస్యలను శ్రద్ధగా విని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తదుపరి చర్యల కోసం వారిని కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల సకాల స్పందనతో మూడు ప్రాణాలు నిలిచాయని అధికారులు తెలిపారు. కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారు ఆత్మహత్య వంటి దారుణ నిర్ణయాలు తీసుకోకుండా స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. సమావేశాల తొలి రోజైన మార్చి 16న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, రాబోయే ఏడాదికి సంబంధించిన కార్యాచరణపై గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరుగుతుంది. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయం-వ్యయ అంచనాలు, సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు బడ్జెట్‌లో ప్రాధాన్యం పొందనున్నాయి. మార్చి 30 వరకు జరిగే ఈ సమావేశాల్లో బడ్జెట్‌పై విస్తృత చర్చలు, శాఖల వారీగా డిమాండ్లపై చర్చ, ఆమోద ప్రక్రియ జరుగనుంది. రాష్ట్ర రాజకీయాల్లో బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.

# అంబర్‌పేటలో విషాదం...

**హైదరాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంబర్‌పేట బాపునగర్ కాకతీయ వీధిలో నివసిస్తున్న రామ్‌రాజ్ (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)లు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దంపతులకు ఇటీవలే కుమార్తె వివాహం జరిగినట్లు సమాచారం. రామ్‌రాజ్ గతంలో వ్యాపారం నిర్వహించేవారని, ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనకు ముందు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బాండ్ పేపర్‌పై రాసి శశాంక్ తన స్నేహితుడికి సందేశం పంపినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక సమస్యలే కారణమా, లేక మరే ఇతర అంశాలున్నాయా అన్నదానిపై లోతుగా విచారణ కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు, పరిచయస్తుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.



# భూదాన్ వివాదం రగిలింది

**ఖమ్మం, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగర శివారులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెలగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల విషయంలో అధికారులు భారీ చర్యలకు సిద్ధమయ్యారు. నాలుగు జిల్లాల నుంచి వేలాది మంది పోలీసులను మోహరించినట్లు సమాచారం. భారీ సంఖ్యలో యంత్రాలతో పాటు పోలీసు బలగాలు అక్కడికి తరలించబడడంతో ఉదయం నుంచే ఉద్రిక్తత పెరిగింది. భూదాన్ భూముల్లో నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చివేయడానికి రంగం సిద్ధమైందని స్థానికులు చెబుతున్నారు. పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీప ప్రాంతంలోనే ఈ పరిణామాలు చోటు చేసుకోవడంతో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ఏ క్షణమైనా కూల్చివేతలు ప్రారంభమయ్యే అవకాశముందని సమాచారం. కవరేజ్ కోసం వెళ్తున్న మీడియా ప్రతినిధులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పై అధికారుల ఆదేశాల మేరకే మీడియాకు అనుమతి ఇవ్వడం లేదని పోలీసు వర్గాలు చెబుతున్నట్లు సమాచారం. దీనిపై జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ ఇళ్లను కోల్పోతామనే భయంతో నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు అకస్మాత్తుగా వెళ్లిపోవాలని చెప్పడం అన్యాయమని వాపోతున్నారు. కొంతమంది యువకులు కర్రలతో సిద్ధమై ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధితుల ఆగ్రహం, పోలీసుల భారీ మోహరింపుతో ఖమ్మం శివారులో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



# వికలాంగునికి అందని పెన్షన్ .. పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

**వేలేరు, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన కొయ్యడ స్వామి (తండ్రి గట్టయ్య)కు గత నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో పూర్తిగా కుడి కాలు తొలగించాల్సి వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుండి శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్న ఆయన వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



పలుమార్లు గ్రామ పంచాయతీ కార్యదర్శిని కలిసి వేడుకున్నప్పటికీ సరైన స్పందన లభించలేదన తన సమస్యను పట్టించుకోవడం లేదని స్వామి కన్నీరు పెట్టుకున్నారు. తాను పని చేయలేని పరిస్థితిలో ఉన్నందున జీవనోపాధి కష్టంగా మారిందని, కనీసం ఇప్పుడు అయినా గ్రామ సర్పంచ్ మరియు సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు కూడా అధికార యంత్రాంగం స్పందించి అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# హెల్మెట్ తప్పనిసరి ప్రాణ రక్షణకు మొదటి అడుగు




- ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్ కుమార్


**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కోతులనడుమ గ్రామంలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎల్కతుర్తి ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, హెల్మెట్ అనేది కేవలం ఒక ఉపకరణం కాదని, అది ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలే ప్రధాన కారణమని తెలిపారు.
కేవలం పోలీసుల జరిమానా తప్పించుకోవడానికి కాకుండా, ఐఎస్ఐ ముద్ర కలిగిన నాణ్యమైన హెల్మెట్‌లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. సరైన సైజ్‌లో, బిగుతుగా ధరించిన హెల్మెట్ మాత్రమే రక్షణనిస్తుందని వివరించారు.
"ప్రాణం కంటే హెల్మెట్ బరువు కాదు. మీ కుటుంబం కోసం అయినా హెల్మెట్ ధరించండి" అని ఎస్.ఐ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విఠల్, వికిల్ పాల్గొన్నారు. గ్రామస్తులు కార్యక్రమాన్ని అభినందించారు.

# బీటెక్ ఫలితాల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల సత్తా.!

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కళాశాలకు ప్రత్యేక గుర్తింపు.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని బి గంగారం గ్రామంలో స్వయంప్రతిపత్తి కలిగిన సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బీటెక్ రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ విడుదల చేసిన ఫలితాల్లో కళాశాల విద్యార్థులు ఉన్నత స్థాయి మార్కులు సాధించి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**బ్రాంచీల వారీగా ఫలితాలు:**
విద్యుత్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ): బొగ్గం శ్రీవాహిని 8.15 ఎస్జిపిఏ (76.5%), దునుకు నిఖిల్ 7.3 ఎస్జిపిఏ (68%), బన్నే సిద్ధార్థ 6.8 ఎస్జిపిఏ (63%). ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ): తాళ్లూరి నాగశ్రీ 8.95 ఎస్జిపిఏ (84.5%), షేక్ రహీమాన్ 8.06 ఎస్జిపిఏ (81%), తిప్పర్తి మోహన శ్రీ 8.55 ఎస్జిపిఏ (80.5%). కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ): ఓరుగంటి సద్వర్షిణి 8.90 ఎస్జిపిఏ (84%), నల్లని చక్రవర్తుల ఆశ్రిత 8.55 ఎస్జిపిఏ (80.5%), షేక్ సమీర 8.55 ఎస్జిపిఏ (80.5%), తేజావత్ నాగరాజేశ్వరి 8.30 ఎస్జిపిఏ (78%). కంప్యూటర్ సైన్స్ & మెషీన్ లెర్నింగ్ (సీఎస్ఎం): పాలోజు విజయలక్ష్మి 9.25 ఎస్జిపిఏ (87.5%), శీలం సౌమ్య 9.2 ఎస్జిపిఏ (87%), అడపా దుర్గాబాంధవి 8.55 ఎస్జిపిఏ (80.5%), బన్నే ఉమామహేశ్వరి 8.55 ఎస్జిపిఏ (80.5%), చీమల మహేశ్వరి 8.55 ఎస్జిపిఏ (80.5%). కృత్రిమ మేధస్సు & డేటా సైన్స్ (ఏఐ & డీఎస్): చిన్నంశెట్టి యుగంధర్ 8.7 ఎస్జిపిఏ (82%), తోకల ఝాన్సీ 8.06 ఎస్జిపిఏ (81%), మోటేపల్లి భావనశ్రీ 8.55 ఎస్జిపిఏ (80.5%), కళ్యాణపు ఉష 8.55 ఎస్జిపిఏ (80.5%), చల్లారి హారిక 8.55 ఎస్జిపిఏ (80.5%).



సెమిస్టర్ గ్రేడ్ పాయింట్ అవరేజ్ (ఎస్జిపిఏ) ఆధారంగా అన్ని విభాగాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి, పరీక్షల విభాగాధిపతి డాక్టర్ పాముల శేఖర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్ తదితరులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.





# సిద్ధాపూర్‌లో దారుణ హత్య


- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ దార కవిత.
- మహిళపై కేసు నమోదు,గ్రామంలో ఉద్రిక్తత

**హసన్ పర్తి,ఫిబ్రవరి24(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామంలో జరిగిన దారుణ హత్య సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళపై మర్డర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.డీసీపీ దార కవిత స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం సిద్ధాపూర్‌కు చెందిన బాల్నే రాజ్‌కుమార్ (40) గుమస్తాగా పనిచేస్తూ అతని తండ్రి బాల్నే మొగిలి, తల్లి సరోజన గత 20 సంవత్సరాలుగా హనుమకొండలోని అమృత హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు.వారి కుటుంబానికి చెందిన సొంత ఇల్లు సిద్ధాపూర్‌లో ఉండగా రాజ్ కుమార్ చిన్నమ్మ వంగ ఇందిరకు ఎవరు లేకపోవడంతో అక్కడే నివసిస్తూ వచ్చినట్లు సమాచారం. మూడు నెలల క్రితంపిర్యాదు దారుని తల్లి సరోజన మృతి చెందడంతో తండ్రి బాల్నే మొగిలి స్వగ్రామానికి వచ్చి తన ఇంట్లో నివసిస్తున్నాడు.ఈ క్రమంలో ఇంట్లో ఉన్న వంగ ఇందిరతో తరచూ గొడవలు జరుగుతున్నాయని,ఇట్టి విషయాన్ని తన కుమారుడు రాజ్‌కుమార్‌కు కూడా పలుమార్లు తెలిపిరాని మంగళవారం రోజున (24062026) ఉదయం రాజ్‌కుమార్‌కు బావమరిది అయిన వంగ సారంగపాణి ఫోన్ చేసి సొంతింటి వెనుక భాగంలో బాల్నే మొగిలి మృతదేహం పడి ఉందని సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న రాజ్‌కుమార్ వచ్చి చూడగా తన తండ్రి ముఖం,నుదురు భాగంలో పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలు ఛాతి,మెడ చుట్టూ కూడా తీవ్ర గాయాలు కనిపించడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి నట్లు హసన్ పర్తి పోలీసులు తెలిపారు. ఫిర్యాదుమేరకు వంగ ఇందిరపై హత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ దార కవిత పరిశీలించి అక్కడ లభ్యమైన ఆధారాలను సేకరించేందుకు ఫోరెన్సిక్ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. కేసును ప్రతి కోణంలో విచారించాలని, ఆధారాల సేకరణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. డీసీపీ వెంట హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు, ఎస్ఐ దేవేందర్, రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

- రాగుల రమేష్ ముదిరాజ్ గృహంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు

**కీసర , ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం 8వ వార్షికోత్సవాన్ని కీసరలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీసరగుట్ట మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు, కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డ్ సభ్యుడు రాగుల రమేష్ ముదిరాజ్ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహోత్సవం సందర్భంగా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు రాగుల రమేష్ ముదిరాజ్ పుణ్యదంపతులను వారి స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ఆశీర్వాదాలు పొందారు. రాగుల రమేష్ ముదిరాజ్ సామాజిక సేవలో మరింత ముందుండి పేద ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో కీసర మాజీ ఎంపిటిసి రమేశ్ గుప్తా, కీసరగుట్ట మాజీ ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ, బొడుసు రమేష్ యాదవ్, కీసర మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ బూడిగ జగన్, బక్కని కుమార్ జెకె, తుడుం శ్రీనివాస్, సుమన్ బన్నీ, కానుకుంట శ్యాము కుమార్, కట్ట శంకరయ్య, ఎర్ర సాయిలు తదితరులు పాల్గొన్నారు.భక్తుల నామస్మరణ, హారతులతో కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



# నాచారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు






- సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై వందమంది పార్టీలో చేరిక
- ఉప్పల్ ఇన్‌ఛార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి

**నాచారం, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన స్పందన వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సుమారు వందమంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.నాచారం డివిజన్‌కు చెందిన సామాజిక కార్యకర్త భావనా గౌడ్ తన అనుచరులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం నాచారం ప్రాంత అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సంవత్సరాల్లోనే రూ.30 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు భావనా గౌడ్ సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.భావనా గౌడ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పసికందు మృతి ఘటనపై కీసరలో భారీ నిరసన ర్యాలీ



_నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్

**కీసర, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):**నాగర్ కర్నూలు జిల్లాలో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కీసర మండలంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కీసర మండల రజక సంఘం, ఆదిజాంబవ అరుంధతి సేవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు దళిత, బహుజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.కుమ్మెర జాతర సందర్భంగా టికెట్ విషయంలో తలెత్తిన వివాదం హింసకు దారితీసిందని, ఈ క్రమంలో గణేష్-చంద్రకళ దంపతులపై దాడి జరిగి వారి రెండు నెలల పాప మౌనిక మృతి చెందినట్లు నాయకులు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా కులవివక్ష ఘటనలు కొనసాగడం దురదృష్టకరమని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఐక్యంగా నిలబడి ఇలాంటి ఘటనలకు ధీటుగా పోరాడతామని హెచ్చరించారు. కీసర అంబేద్కర్ ప్రధాన చౌరస్తా నుండి వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం పసిపాపకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. పాపకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ రామారం సుజాత, లాయర్ బక్కని కుమార్, రజక సంఘం అధ్యక్షుడు జూపల్లి సాయిలు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్, మాదిగ జాగృతి సంఘం అధ్యక్షుడు కొమ్ము రవి, సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వెస్ట్ మారేడ్పల్లిలో ఆంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ





- **ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్**

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్‌లోని వెస్ట్ మారేడ్పల్లిలో రెండువందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి ఆలయాన్ని పునఃనిర్మాణం చేసి, నూతన ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీరామ పరివారం, శివుడు, నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో మనుషుల మధ్య ఉన్న పవిత్రమైన సంబంధాలు కొన్నిసార్లు తగ్గుతున్నట్లుగా అనిపిస్తున్నప్పటికీ, కలియుగంలో కూడా ధర్మ పరిరక్షణ కోసం భక్తులు ముందుకు రావడం ఆనందకరమని అన్నారు. ధర్మం నిలిస్తేనే సమాజం నిలుస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజలు తమ సామర్థ్యానికి తగ్గట్టుగా ధర్మ పరిరక్షణకు కృషి చేయడం గొప్ప విషయమని, ఈ కార్యక్రమాల ద్వారా సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలు రాబోయే తరాలకు అందుతాయని చెప్పారు. ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బ్రాహ్మణులకు, నిర్వాహకులకు, భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భానుక నర్మదా మల్లికార్జున్, దీపిక, పిట్టల నాగేష్ ముదిరాజ్, శేఖర్ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రజక సంఘం నాయకులు





**వరంగల్,ఫిబ్రవరి24(తెలంగాణ ముచ్చట్లు):**నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దారుణ దాడి ఘటన నేపథ్యంలో, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా రజక సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులకు ధైర్యం చెప్పి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు సంబంధిత అధికారులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దాడిలో మరణించిన అమ్మాయి మౌనిక సమాధిని సందర్శించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన ర్యాలీలో వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చిట్యాల బిక్షపతి, మర్రి కుక్కల చైతన్య, పంతంగి సమ్మయ్య, దొడ్డిపాటి శేఖర్, బండి సదానందం ఉన్నారు.

# డ్రైనేజీ పూర్తయ్యాకే రోడ్లు వేయాలి: సాయిజెన్ శేఖర్

- **బాబా నగర్–హనుమాన్ నగర్‌లో డ్రైనేజీ సమస్యలపై స్థానికుల ఆవేదన**
- **నిధులు మంజూరు అయ్యాయని వెల్లడించిన బీఆర్ఎస్ నేత**
- **పనులు తక్షణమే ప్రారంభించాలని జలమండలికి విజ్ఞప్తి**



**నాచారం, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్‌లోని బాబా నగర్ మరియు హనుమాన్ నగర్ బార్డర్లలో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపు పూర్తికి చేరుకున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తెలిపారు.అయితే నూడిల్స్ వీధి మరియు ఐస్ ఫ్యాక్టరీ పక్కన ఉన్న వీధుల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ పనులు పూర్తి కాకముందే రోడ్లు వేస్తే భవిష్యత్తులో మళ్లీ తవ్వకాలు చేయాల్సి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు.స్థానికుల అభ్యర్థన మేరకు ముందుగా డ్రైనేజీ పనులు పూర్తి చేసి అనంతరం రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ మేరకు రోడ్డు పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని సంబంధిత కాంట్రాక్టర్ మరియు అధికారులకు తెలియజేశారు.రెండు వీధుల్లో డ్రైనేజీ పనుల కోసం ఇప్పటికే నిధులు మంజూరు అయినట్లు వెల్లడించిన సాయిజెన్ శేఖర్, పనులను వెంటనే ప్రారంభించాలని జలమండలి మేనేజర్‌ను ఫోన్ ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో

# ప్రజా రంజక పాలనను సాగించాలి..

- **వైరా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లకు ఏఐటియుసి ఘన సన్మానం..**



**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలను మెప్పిస్తూ ప్రజారంజక పాలనను కొనసాగించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబులు చైర్మన్ వైస్ చైర్మన్ లను కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన వైరా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ల తో పాటు 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, నాలుగో వార్డ్ కౌన్సిలర్ నిమ్మతోట శ్రావణి లకు సన్మానం చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలలో వైరా ఒకటి ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను వైరా మున్సిపాలిటీ నే అనుసంధానం చేస్తుంది అన్నారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్టా సంతోష్ ఇద్దరూ ఉన్నత విద్యను అభ్యసించిన వారేనని ప్రజల కష్టసుఖాలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వంత ప్రాంతం అవ్వడం చేత ఎక్కువ నిధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని దానిని ఉపయోగించుకొని మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయండి.

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు వైరా మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించటంతో పాటు స్పెషల్ డ్రైవ్ లో నియమించబడిన డైలీ వైస్ కార్మికులకు జీవో నెంబర్ 14 ద్వారా జీతాలు ఇచ్చేలా ఏర్పాటులు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు చైర్మన్ వైస్ చైర్మన్ లను ఈ సందర్భంగా కోరారు.. తొలి సమావేశంలోనే ఈ విషయంపై చర్చించాలని ఆయన ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను కోరారు. అభివృద్ధి విషయంలో పారిశుద్ధ్యం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, పారిశుద్ధ కార్మికులందరూ నూటికి నూరు శాతం అహర్నిశలు కృషి చేసే బాధ్యత తమతన్నారు. కార్మికులకు అందించాల్సిన యూనిఫామ్, సబ్బులు, నూనె, గ్లౌజులు, బూట్లు , ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన ఈ సందర్భంగా వారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గారపాటి అశోక్, సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, ఏఐటియుసి పట్టణ నాయకులు ఎస్కే షరీఫ్, మందా రామకృష్ణ, తగరం గురుమూర్తి మాచర్ల నాగభూషణం, నల్లమోతు సురేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాయపూడి శ్రీనివాసరావు, బోళ్ళ శ్రీను, రేపూడి కన్నయ్య, పిడియాల లక్ష్మయ్య, వీరన్న, ఉప్పతల సాంబ బండారు సైదులు దాసరి కృష్ణ బక్క రాములు బిల్లా ప్రసాద్ షేక్ ముస్తఫా, ఇండ్ల జయరాజు కటుకూరి స్వామిదాస్ ఏఐటియుసి మున్సిపల్ వర్కర్స్ కార్మికులు అందరు పాల్గొన్నారు .



# అకాల వర్షం అపార నష్టం నేలమట్టమైన మొక్కజొన్న తోటలు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు ):** అకాల వర్షం చింతకాని మండలంలోని రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ముఖ్యంగా నాగిలిగుండ గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలు గాలివాన ధాటికి పూర్తిగా నేలమట్టమయ్యాయి. చేతికి వస్తుందనుకున్న పంట కళ్లముందే నాశనం కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**తీవ్ర నష్టం**

పంట కోతకు వచ్చే సమయంలో వచ్చిన ఈ వర్షం వల్ల మొక్కజొన్న కంకులు నేలపాలై కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది.

> **"కళ్ల ముందే పంట నేల రాలింది.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోకపోతే అప్పుల పాలు కావడం ఖాయం."**
> — బాధిత రైతు, వేపూరి రాంబాబు నాగిలిగుండ

**పెట్టుబడి వృథా**

ఎకరానికి వేల రూపాయలు ఖర్చు చేసి, రేయింబవళ్లు కష్టపడి పెంచిన పంట ఇలా నేలమట్టం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

**ప్రభుత్వానికి విన్నపం**

అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే చేసి నష్టపరిహారం అందించాలని నాగిలిగుండ రైతులు వేడుకుంటున్నారు. ప్రకృతి ప్రకోపానికి బలియైన అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి, నష్టాన్ని అంచనా వేసి రైతులకు భరోసా కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు



**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు ):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన పోలీస్ స్టేషన్ సమీపంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.

ఎస్సై అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు, కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం కనుకుల గిద్ద గ్రామానికి చెందిన తోకల ప్రభాకర్ రెడ్డి, రేణుక దంపతులు పనిమీద హనుమకొండకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వారి వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో రేణుకకు తీవ్ర గాయాలు కాగా, ప్రభాకర్ రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని, గాయపడిన రేణుకను 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

- **మల్లారం సర్పంచ్ కటిక కిరణ్ కుమార్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** తల్లాడమండల పరిధిలోని మల్లవరం గ్రామ సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ రాబోయే వేసవి ఎద్దడిని తట్టుకునేందుకు చెరువు కట్ట కింద ఉన్న బావికి మోటార్ బిగించి గ్రామంలో మంచినీటిని సరఫరా చేసేందుకు మంగళవారం సమాయత్తం అయ్యారు, వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేందుకు ముందస్తు ప్రణాళికతో సర్పంచ్ చేపట్టిన ముందస్తు చర్యలకు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎర్రి నరసింహారావు, తల్లాడ మండలం ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్యా అంజయ్య, గ్రామ పంచాయతి సిబ్బంది. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పత్రికల, నియోజకవర్గ జర్నలిస్టులకు న్యాయం చేయాలి

◆అడిషనల్ కలెక్టర్‌కు టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) వినతి



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల మంజూరులో నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, చిన్న పత్రికలలో పనిచేస్తున్న విలేఖరులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న నియోజకవర్గ స్థాయి సీనియర్ రిపోర్టర్లు అక్రిడేషన్ ప్రక్రియలో విస్మరించబడటం బాధాకరమని పేర్కొన్నారు. చిన్న పత్రికలలో పనిచేస్తున్న అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు కొనసాగించాలని, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు కార్డుల మంజూరు ప్రక్రియను నిరంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మర్పించిన వినతి పత్రంలో నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం, చిన్న పత్రికల విలేఖరులకు సమాన అవకాశాలు కల్పించడం, ఇప్పటికే సేవలందిస్తున్న జర్నలిస్టుల అక్రిడేషన్ రద్దు చేయకుండా పునరుద్ధరణ చర్యలు చేపట్టడం వంటి అంశాలను స్పష్టంగా ప్రస్తావించారు.

వినతి పత్రాన్ని స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఆవేదనను సానుకూలంగా పరిగణిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీ.బీ.జే.ఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, గౌరవరపు జగదీష్, మామిడాల వీరబాబు, ఎలిసెట్టి రామకృష్ణ బాబు, వంగ పుంగమ గౌడ్, కరాటే వేణు, పాగా యేనా, భాగ్యరాజ్, సందీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన జీడి.హన్సిని (లక్కీ)



**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరం గుట్టల బజారుకు చెందిన జీడి.హన్సిని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో 12వ తరగతి చదువుతుంది. తన చిన్న తనం నుండి సర్దార్ పటేల్ స్టేడియంలో కోచ్ అక్బర్ అలీ వద్ద శిక్షణ తీసుకొని తన క్రీడా ప్రతిభతో అంచెలంచెలుగా ఆడుతూ వరుసగా మూడు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆడి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. ప్రస్తుతం ఈ నెల 24 నుండి మార్చి 1 వరకు హుగ్లీ (పశ్చిమ బెంగాల్లో) వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియ వారు నిర్వహించే 46వ జాతీయ సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల అధికారి తుంబూరు సునీల్ కుమార్
హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి రెడ్డి కరస్పాండెంట్ రవి మారుత్ మరియు స్టేడియం కోచ్ లు తల్లిదండ్రులు స్థానిక పెద్దలు హన్సినీ అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి భారత వాలీబాల్ జట్టులో స్థానం సంపాదించాలని కోరారు.

## గ్రామ అభివృద్ధి తమ ధ్యేయమంటున్న కొప్పూరు గ్రామ సర్పంచ్




**భీమదేవరపల్లి తెలంగాణ ముచ్చట్లు:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామ అభివృద్ధి తమ దేయమంటూ ముందుకు సాగుతున్న నూతన పాలకవర్గం. ఎస్సీ కాలనీ లో ఉన్న బోరు పని చేయనందున దానిని రిపేరు చేయించగా అది బాగు కాకపోవడంతో కొత్త బోర్ మోటరు తెచ్చి బిగించడం జరిగింది, వచ్చేది వేసవికాలం కనుక ప్రజలు నీరుకు ఇబ్బందుల ఎదుర్కోవద్దని నీటి సౌకర్యం కల్పించారు. గ్రామ అభివృద్ధి కోసం ముఖ్యపాత్ర పోషిస్తున్న సర్పంచ్ గద్ద కుమార్ స్వామి మరియు ఉపసర్పంచి మిర్యాల రాణి రాజు గ్రామంలో ఏ సమస్య ఉన్న వెంటనే పరిష్కరించడం సమస్యలు ఏమైనా ఉంటే వాటి గురించి అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు గ్రామ ప్రజలు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వార్డు మెంబర్ బాకీ అయిలమ్మ సమ్మయ్య కొమ్ముల రవీందర్. మెకానిక్ గడిపే కనకయ్య. గడిపే వీరస్వామి. గడిపే సందీప్. గ్రామస్తులు పాల్గొన్నారు

# ముప్పారం మురిసిపోవాలి ఎమ్మెల్యే కడియం



**ధర్మసాగర్,ఫిబ్రవరి24(తెలంగాణ ముచ్చట్లు):** చారిత్రక ముప్పారం గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తే నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ముప్పారం గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన నివాసంలో మంగళవారం నిర్వహించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సర్పంచ్ గుంటిపల్లి రేణుకను బృందాన్ని అభినందించారు. ఈ రెండు నెలల సమయంలో గ్రామ అభివృద్ధి పట్ల గ్రామపంచాయతీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. గ్రామంలో కుడా ప్రత్యేక నిధుల కింద మూడు సీసీ రోడ్లకు రూ.70 లక్షలు మంజూరు చేపిస్తారని హామీ ఇచ్చారు. అలాగే పెండింగ్లో ఉన్న గ్రామ కమిటీ భవనాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం గౌడ కమ్యూనిటీ హాలకు రూ. 5లక్షలు కురుమ కమ్యూనిటీ హాలుకు రూ 5 లక్షలు, నూతనంగా పద్మశాలి కమ్యూనిటీ హాల్ కు రూ.5 లక్షలు మంజూరు చేపిస్తున్నట్టు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే గ్రామంలో 50 ఇందిరమ్మ గృహాలకు కూడా ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా ఇల్లు లేని నిరుపేదల కోసం గ్రామంలో కొత్తగా నివేషణ స్థలాలు ఎంపిక చేస్తామని ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ. 10 లక్షలతో మహిళా స్వయం సహాయక సంఘ భవనం, రూ.17 లక్షల తో ముప్పారం పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు విడుదలైన దరిమిల ఆ పనులను తక్షణమే ప్రారంభించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. సర్పంచ్ గుంటిపల్లి రేణుక, ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, వార్డు సభ్యులు కందుకూరి విజయ్ చందర్, శ్వేతా విద్యసాగర్ చిట్యాల సునీత బాలస్వామి, ఎత్తిరాజుల శోభారాణి, మల్లయ్యలతో పాటు బ్రహ్మ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి కోతి సామ్రాజ్ గౌడ్ పెద్ద శ్రీనివాస్, కందుకూరి ప్రసాద్, గోనెల రాజయ్య, గయ్ కుమార్ స్వామి లు పాల్గొన్నారు

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి: మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగాలని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఉప్పల్ కేకేఆర్ గార్డెన్స్‌లో లావణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ పూర్తి కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు .ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలైన స్వప్న, సరళ, మహాలక్ష్మి లకు కుట్టు మిషన్లను అందజేశారు. మహిళలు తమ ప్రతిభను చాటుకుని స్వయం సమృద్ధిగా మారాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీలేని రుణాలు వంటి కార్యక్రమాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సాధికారత కోసం కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లావణ్య ఫౌండేషన్ ఫౌండర్ లావణ్య, సంధ్య, టీచర్లు వాణి, మాధురి, నవనీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బస్తీబాటలో పటాన్ బస్తీ పర్యటన సమస్యల పరిష్కారమే లక్ష్యం: నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ "బస్తీబాట" కార్యక్రమంలో భాగంగా పటాన్ బస్తీలో పర్యటించారు. పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఏర్పాటు చేసిన వీధి లైట్ల పనితీరును స్వయంగా పరిశీలించి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయని నిర్ధారించారు. వీధి లైట్లు సరిగా వెలుగుతున్నందుకు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజలతో కలిసి నడవడమే నా రాజకీయ ధ్యేయం. సమస్యలు వినడమే కాదు, వాటికి శాశ్వత పరిష్కారం చూపడమే నా లక్ష్యం. ప్రజల కోసం - ప్రజల మధ్య - ప్రజలతో కలిసి ముందుకు సాగుతాను" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాల్‌రాజ్ గౌడ్, శ్రీనివాస్, కోయలకొండ రాజేష్, సురేష్ గౌడ్, కాంపెల్లి శివ, అశోక్, సాయి, నవీన్, రావుల వెంకన్న, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఇంతియాజ్ బేగం, ఇజ్రత్ బానోతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ మోసం.. 90 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.2.5 కోట్లు దోపిడి

- ◆ గ్వాలియర్‌లో సంచలనం
- ◆ వీడియో కాల్స్‌తో బెదిరించి నగదు బదిలీ
- ◆ బ్యాంక్ అప్రమత్తతతో వెలుగులోకి ఘటన

**డెస్క్, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):** సైబర్ నేరగాళ్ల "డిజిటల్ అరెస్ట్" మోసం మరోసారి భారీగా బయటపడింది. మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 90 ఏళ్ల వృద్ధుడిని బెదిరించి ఏకంగా రూ.2.5 కోట్లు దోచుకున్న ఘటన కలకలం రేపింది. బాధితుడు ఎయిర్‌ఫోర్స్‌లో వైద్యుడిగా సేవలు అందించి పదవీ విరమణ చేసిన వృద్ధుడు అని పోలీసులు తెలిపారు. జనవరి 25న బాధితుడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము దర్యాప్తు సంస్థకు చెందినవారమని, అతని ఆధార్, బ్యాంకు వివరాలు చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ఉపయోగించబడ్డాయని మోసగాళ్లు నమ్మించారు. కేసు నుంచి బయటపడాలంటే తాము చెప్పినట్లు చేయాలని, లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరించారు. ప్రతి రోజు వీడియో కాల్‌లో ఉండాలని, ఈ ప్రక్రియ రహస్యమని కుటుంబ సభ్యులకు కూడా చెప్పకూడదని ఒత్తిడి చేశారు. సుమారు 25 రోజుల పాటు మానసిక ఒత్తిడి తెచ్చి, బ్యాంకు ఖాతాలోని నగదును తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. ఇలా విడతలవారీగా రూ.2.5 కోట్లు మోసం చేశారు. భారీ మొత్తంలో డబ్బు బదిలీ అవుతుండటంతో అనుమానం వచ్చిన బ్యాంక్ మేనేజర్ విచారించగా అసలు విషయం బయటపడింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుల ఆనవాళ్ల కోసం గాలిస్తున్నారు. అధికారిక సంస్థలు ఫోన్ ద్వారా ఎప్పుడూ అరెస్టు, డిజిటల్ విచారణ పేరుతో డబ్బులు అడగవని, ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నడిరోడ్డులో గుంట.. ప్రమాదాల ముప్పు!

- ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించాలి..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు)

జగన్నాథపురం-చింతకాని ప్రధాన రహదారిపై నడిరోడ్డులో భారీ గుంట ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ గుంట స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గంలో రోజూ భారీగా వాహన రాకపోకలు ఉండటంతో ఏ చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదానికి దారితీసే పరిస్థితి ఉందని వాహనదారులు చెబుతున్నారు.సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంటను పూడ్చి, అవసరమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



# బొగ్గు నాణ్యత, ఉత్పత్తి పెంపుపై దృష్టి

- రోజుకు 54 వేల టన్నుల రవాణా లక్ష్యం
- డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు.

సత్తుపల్లి, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు):

బొగ్గు నాణ్యత మెరుగుదలతో పాటు ఉత్పత్తి పెంపుపై అధికారులు కృషి చేయాలని డైరెక్టర్ (పి&పి) కె. వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం జి ఎం కార్యాలయంలో జి ఎం (సి పి పి) మనోహర్, జి ఎం క్వాలిటీ జేవి రమణ, జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సమక్షంలో సత్తుపల్లి ఏరియాలోని అన్ని ప్రాజెక్టు కార్యాలయాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు 38 వేల టన్నుల బొగ్గును రైలు మార్గం ద్వారా, మరో 16 వేల టన్నులను ఆర్సి హెచ్‌పీకి రవాణా చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. లక్ష్యాల సాధనలో సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జి ఎం సిహెచ్ శ్రీనివాస్, ఎస్ ఓ టు జి ఎం బొల్లం శ్రీనివాస్, జేవిఆర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్వి ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఎల్ఎస్వి సునీల్ వర్మ, ఎస్ ఓ ఎం బి రాజేశ్వరరావు, కిష్టారం ఓసిఎం బి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కోరుతూ వినతి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24 (తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లా అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తిని సభ్యుడిగా నియమించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగాలంటే జర్నలిస్టు సంఘాలకు తగిన ప్రాతినిధ్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, చిన్న పత్రికల విలేకరుల సమస్యలను సమర్థవంతంగా కమిటీలో ప్రస్తావించేందుకు టిడబ్ల్యుజేఎఫ్‌కు అవకాశం కల్పించాలని లేఖలో వివరించారు.

ఈ లేఖ ప్రతిని జిల్లా డిపిఆర్‌వో కి అందజేసినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో జిల్లా నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

జిల్లా పరిపాలన జర్నలిస్టుల హక్కులను గౌరవిస్తూ,సముచిత నిర్ణయం తీసుకుని కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఎ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, గౌరవరపు జగదీష్, మామిడాల వీరబాబు, ఎలిసెట్టి రామకృష్ణ బాబు, వంగ పుంగమ గౌడ్, కరాటే వేణు, పాగా యేనా, భాగ్యరాజ్, సందీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగు మట్ల భూములు స్వాధీనం...

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
- వెలుగుమట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై మీడియా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -24(తెలంగాణ ముచ్చట్లు )



తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెలుగు మట్ల భూదాన్ భూములలో అక్రమ కట్టడాల తొలగింపుపై లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావుతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 1953 లో కలవల రాజా రామారావు సర్వే నెంబర్ 147, 148,149 లో 31 ఎకరాల 7 గుంటల భూమి భూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. భూదాన్ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గమనించిన ఖమ్మం అర్బన్ తహసిల్దార్ 2019 లో ఆక్రమణలు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు. ఖమ్మం అర్బన్ తహసిల్దార్ జారీ చేసిన నోటీసులను హైకోర్టులో చాలెంజ్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారని, హైకోర్టు తహసిల్దార్ కు భూదాన్ భూముల అంశంలో జ్యూరిస్డిక్షన్ సరిపోదని తెలుపుతూ తహసిల్దార్ ఆర్డర్ పై స్టే ఇస్తూ పిటిషన్ దారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా భూదాన్ భూమి స్వభావాన్ని మార్చడానికి వీలులేదని తెలుపుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు.

కొర్లపాటి పరమేశ్వరి మరో 9 మంది పిటిషన్ దారులు కలిసి 2023 లో భూదాన్ భూములలో నిర్మించిన నిర్మాణాలను తొలగించకుండా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారని, దీనిపై హైకోర్టు స్పందిస్తూ కోర్టుకు సమర్పించిన పట్టా వివరాలు సరిగ్గా లేవని, భూదాన్ భూములలో పేదలు ఇండ్లు నిర్మించుకున్నట్లు దరఖాస్తు సమర్పించారని, పిటిషన్ దారులకు సంబంధించిన నిర్మాణాలను తొలగించవద్దని, నిర్మాణాలు లేకుండా మిగిలి ఉన్న భూమిలో ఎటువంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని స్టేటస్ కో జారీ చేసిందని అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞా బోర్డు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టిందని, జనవరి 17, 2026 నాడు సంబంధిత పిటిషన్ దారులకు ఎటువంటి కేటాయింపులు చేయలేదని, 5 ఎకరాలు కేజీబీవీ పాఠశాలకు, 5 ఎకరాలు మోడల్ స్కూల్ కోసం మాత్రమే కేటాయింపులు చేసినట్లు తేల్చిందని అన్నారు. భూదాన్ భూములలో నివసిస్తున్న 308 ఆక్రమణదారులకు వెంటనే ఖాళీ చేయాలని జనవరి 17, 2026 న తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు నోటీసులు జారీ చేసిందని అన్నారు. వెలుగుమట్లలో కొంతమంది ఆక్రమణదారులు 2014 లో తమకు అలాట్మెంట్ వచ్చినట్లు కాగితాలు చూపిస్తున్నారని, రికార్డుల పరిశీలనలో ఎటువంటి అలాట్మెంట్ చేయలేదని తేలిందని తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఖమ్మం జిల్లా కలెక్టర్ కు సర్వే నెంబర్ 147, 148, 149 లో 2023లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు రిట్ పిటిషనర్ ఆవుల శిరీష సంబంధించిన నిర్మాణాలు మినహాయించి మిగిలిన భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పోలీస్ అధికారుల సహాయంతో వెలుగుమట్ల భూదాన్ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం, హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేసిన వారి నిర్మాణాలు మినహాయించి మిగిలిన అక్రమ నిర్మాణాలను తొలగింపు చేశామని అన్నారు.

వెలుగు మట్ల భూదాన్ భూములలో ఎవరికి ఎటువంటి అలాట్మెంట్ ప్రభుత్వం చేయలేదని , ప్రభుత్వం ఏకపక్షంగా పేదల ఇండ్ల నిర్మాణాలు కూల్చి వేస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న వార్తలలో వాస్తవం లేదని, పలు మార్లు రికార్డులు పరిశీలించి విచారణ చేసిన తర్వాత తెలంగాణ భూదాన్ బోర్డు ఆదేశాల మేరకు నేడు ఆక్రమణల తొలగింపు చేపట్టామని అన్నారు.

జనవరి 17, 2026 నాడు తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆక్రమణదారులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసిందని, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోమని తెలిపినందున, తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూ దాన్ భూములు ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడానికి నేడు చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. అట్టి భూములలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాల నిర్మాణానికి సంబంధించి కేటాయించిన 10 ఎకరాలు కాకుండా ఎటువంటి కేటాయింపులు చేయలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనం మాత్రమే చేసుకుందని, ఈ భూమి భవిష్యత్తులో ప్రజా ఉపయోగకరమైన కార్యక్రమాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగించడం జరుగుతుందని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని అదనపు కలెక్టర్ అన్నారు.

ప్రస్తుతం నిరాశ్రయులైన వారికి కమ్మవారి సంఘంలో తాత్కాలిక వసతి ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ అన్నారు. భూదాన్ భూముల ఆక్రమణదారుల సామాగ్రి భద్రంగా అంబేద్కర్ భవనంలో స్టోర్ చేశామని, సంబంధిత ప్రజలు ఎక్కడికి ఆ సామాగ్రి తరలించాలంటే అక్కడికి తరలించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

*లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద రావు మాట్లాడుతూ* భూ దాన్ భూముల కేటాయింపు సంబంధించి ప్రజల నుంచి కొంతమంది అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని అన్నారు.

అనంతరం అదనపు కలెక్టర్ పాత్రికేయులకు ఉన్న పలు సందేహాలకు సమాధానాలు తెలిపారు.

ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.






# దానవాయిగూడెం పార్క్ ఏరియా మేకల నారాయణ బోర్డు ప్రాంతంలో ధర్నా

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం దానవాయిగూడెం పార్క్ ఏరియా వాసులు మేకల నారాయణ బోర్డు ప్రాంతంలో ధర్నా నిర్వహించారు . ఆ ఏరియా లో ఉన్న ప్రజలు డస్ట్ ప్రాబ్లమ్ తో అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని మున్సిపల్ కమిషనర్ కు , ఖమ్మం జిల్లా కలెక్టర్ కు , పొల్యూషన్ బోర్డుకి , ఆర్టీఏ ఆఫీసర్ కి , మంత్రి కి వినతి పత్రాలు ఇవ్వటం జరిగినది . కానీ ఇంత వరకు ఎవరి నుంచి కూడా స్పందన లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు . ఈ విషయం తెలుసుకున్న శ్రీ శ్రీటౌన్ సిఐ మోహన్ బాబు ఆ ప్రాంతానికి వచ్చి విషయాన్ని పరిగణనలోకి తీసుకొని హామీ మేరకు ధర్నాను విరమింప చేయడం జరిగిందని ఆ ప్రాంత వాసులు తెలియజేశారు . దానవాయిగూడెం పార్కు ఏరియా 48వ డివిజన్ ప్రాంతము నందు సివిక్ కాంట్రాక్టు కంపెనీ వారు మున్నేరు కరకట్ట నిర్మాణం కొరకు మిక్సింగ్ ప్లాంట్ ను ఆ ప్రాంతం నందు ఏర్పాటు చేయడం జరిగినది . దానికోసం వచ్చే హెవీ వెహికల్స్ లో అధికలోడుతో రాకపోకలు సాగించడం వలన రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి ఇండ్లలోకి దుమ్ము , దూళి రావడం వలన నివాసస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు . కొంతమంది చనిపోవడం కూడా జరిగినది . రోడ్డు మీద వెళ్లే వాహనదారులు కూడా ఈ దుమ్ము వలన ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . ఇటీవలే ఆ ప్రాంతంలో నివసించే వాసి గంధ్ర వెంకటేశ్వర రావు అనే వ్యక్తి ఈ డస్ట్ వల్ల ఊపిరితిత్తులు పాడైపోయి చనిపోవడం జరిగిందని అన్నారు . పెద్దవయసు వారు , చిన్న పిల్లలు ఈ డస్ట్ వల్ల తరచు హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతున్నారు . తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు .

# భారత్ విభిన్న సంస్కృతుల నిలయం

- ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు)

మంగళవారం మై భారత్ - ఖమ్మం, యువజన వ్యవహారాలు & క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల యువజన మార్పిడి కార్యక్రమం హోటల్ సూర్య తేజ ప్రైమ్ బ్యాంకెట్ హాల్ లో ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్ నుండి 40 మంది యువతీ యువకులు ఖమ్మం జిల్లా సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవడం, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను గురించి అవగాహన చేసుకోవడం, వారి సంస్కృతి సాంప్రదాయాలను స్థానిక యువతకు తెలియపరచడం, జాతీయ సమైక్యత ను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం 24 ఫిబ్రవరి నుంచి 28 ఫిబ్రవరి వరకు నిర్వహించబడనుంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి మై భారత్ - ఖమ్మం ఉప సంచాలకులు చింతల అన్వేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం మేయర్







పునుకొల్లు నీరజ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ

భారతదేశ యువత జాతీయ నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, స్వామి వివేకానందుల ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ప్రతి భారత యువకుడు ఇతర మతాలు, సంస్కృతులను గౌరవిస్తూ, ఎలాంటి ద్వేష భావాలు లేకుండా ఐక్యతతో జీవించాలని సూచించారు. ఇటువంటి అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమాలు యువతలో సోదరభావాన్ని పెంపొందించి, జీవితాంతం ఆనందంగా జీవించే శక్తిని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఐ.ఎఫ్.ఎస్ మాట్లాడుతూ

దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, ఎలాంటి ఆశలు లేకుండా సమాజానికి సేవ చేసే గుణం యువతలో పెరగాలని అన్నారు. విద్యాభ్యాస దశలోనే యువతను గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వం విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామాల సమస్యలు ఏమిటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే అవగాహన యువతకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ అకౌంట్స్ అధికారి కమరతపు భాను చందర్, యువజన సంఘాల అధ్యక్షులు కోడిరెక్క ఉమా శంకర్, సయ్యద్ షారుక్ ఇమ్రాన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ అంతర్ జిల్లా యువజన మార్పిడి కార్యక్రమం యువతలో జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



## 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి సీతారాములు దంపతులకు ఘన సన్మానం..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24
(తెలంగాణ ముచ్చట్లు)

13వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్లపాటి విజయ లక్ష్మి సీతారాములు కి అభినందనలు తెలిపి పిఆర్టియు వైరా మండల శాఖ సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి పిఆర్టి యు సీనియర్ బాధ్యులు గన్నవరం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ 13వ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించి ఉపాధ్యాయ పక్షపాతిగా ఎల్లప్పుడూ నిలిచే ముళ్లపాటి విజయ సీతారాము లు కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిఆర్టియు వైరా మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సీతారాములు మాకు ఎప్పుడు కుటుంబ సభ్యుడిలా ఉండి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సహకారం అందిస్తూ ఉంటారని భవిష్యత్తులో కూడా అదే విధంగా వారి సేవలు మాకు ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు మహిళా సీనియర్ బాధ్యులు సునీత, సరస్వతి రూప, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు, మండల సీనియర్ బాధ్యులు ప్రభాకర్, పోలూరి.సనత్ కుమార్, రాగి సురేష్, మహబూబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులను ఆదుకుందాం...

- డాక్టర్ కాపా మురళీకృష్ణ.

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 24
(తెలంగాణ ముచ్చట్లు)

వయసు పైబడిన నిరుపేద వృద్ధులను ప్రతి ఒక్కరు ఆదుకోవాలని వృద్ధాప్యం లో వారికి చేయూతనందించాలని ఫాస్ట్ జిల్లాగవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. వైరాలోని గొల్లపూడి లో ఉన్న విశ్వాస వృద్ధుల వసతి గృహం నందు లయన్ ఉండ్రు శ్యాంబాబు తండ్రి అయిన ఉండ్రు ఆనందరావు రెండవ వర్ధంతి సందర్భంగా వైరా లయన్స్ క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనందరావు జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు ఉండటం బాధాకరమైన వృద్ధుల ను అత్యంత శ్రద్ధగా వారి ఆరోగ్య బాగోగులను ఆశ్రమ నిర్వాహకులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ద్వారా ప్రతి ఒక్కరు వృద్ధులకు చేయూతను అందించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి జిల్లా విజన్ ఐ కేర్ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు జిల్లా కమిటీ సభ్యులు తోటకూర శ్రీకాంత్ గ్రేట్ విజన్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ జాలా మహాలక్ష్మి గ్రేట్ విజన్ క్లబ్ సెక్రటరీ గంగవరపు కిషన్ రాయి కోశాధికారి ఉయ్యూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం భూదాన్ భూముల్లో పేదల గుడిసెల కూల్చివేత

- కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్..

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24
(తెలంగాణ ముచ్చట్లు )



ఖమ్మం కలెక్టరేట్ పరిధిలోని వెలుగు మట్లలో ఉన్న 60 ఎకరాల భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివసిస్తున్న సుమారు 600 పేద కుటుంబాలపై వేలాది మంది పోలీసులతో దాడి చేసి, జేసీబీల సహాయంతో గుడిసెలను కూల్చివేయడం అమానుషం, క్రూరం, ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే చర్య అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదేళ్లుగా అక్కడే నివసిస్తూ తమకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ఈ విధంగా ప్రతాపం చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. హైకోర్టు స్టే పేరుతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు స్వయంగా మంత్రి రంగంలోకి దిగి పోలీస్ బలగాలను దుర్వినియోగం చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

భూదాన్ భూములపై ఎప్పటినుంచో కన్నేసిన జిల్లా మంత్రి సన్నిహితులు వాటిని ఆక్రమించుకునేందుకు తెల్లవారుజామునే భారీ పోలీస్ బలగాలతో పేదల ఇళ్లను ఖాళీ చేయించడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను రోడ్డుపైకి నెట్టివేయడం మానవత్వాన్ని మరిచిన చర్యగా వారు అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నదని స్పష్టం చేస్తూ, మాజీ శాసనసభ్యుడిగా, మాజీ జిల్లా మంత్రిగా ప్రజల తరపున అండగా తాను నిలుస్తూ న్యాయపరంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అధికారం ఉందని పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో తగిన గుణపాఠం చెప్పక మానరని స్పష్టం చేశారు. వెంటనే కూల్చివేతలను నిలిపివేసి, అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు దంపతులకు ఘన సన్మానం..

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 24
(తెలంగాణ ముచ్చట్లు)

వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ గా ఘన విజయం సాధించిన ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు కు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించిన పిఆర్టియు వైరా మండల శాఖ

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి పిఆర్టియు వైరా మండల శాఖ అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ లయన్ కంటి ఆసుపత్రి ద్వారా ఎంతో మందికి నేత్రదానం ప్రసాదించి వారి కుటుంబాల్లో సంతోషాన్ని నిలిపిన ఉండ్రు శ్యాంబాబు ఎన్నికలలో 20వ వార్డు కౌన్సిలర్ గా నిలబడి భారీ మెజారిటీతో గెలుపొందటం నిజంగా వారి సేవా భావానికి తార్కారమని తెలియజేశారు.

మనం ఒకరికి సహాయం, సేవ చేస్తే అది ఏదో ఒక రూపంలో భగవంతుడు మళ్ళీ మనకు బహుమతిగా ఇస్తాడు అనటానికి శ్యాంబాబు వరలక్ష్మి వారి విజయం ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు.

పిఆర్టియు వైరా మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ద్వారా వైరా మండలంలోని అనేక పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించి విద్యాభివృద్ధి కోసం విశేషమైన కృషి చేశారని కొనియాడారు.

లయన్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ మిత్రులతో నాకు చాలా సత్సంబంధాలు ఉన్నాయని, ఈ రోజున మా విజయానికి అభినందనలు తెలియజేయడం కోసం ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.



ఈ కార్యక్రమంలో పిఆర్టియు సీనియర్ బాధ్యులు గన్నవరం హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, మహిళా సీనియర్ బాధ్యులు సునీత, సరస్వతి రూప, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ బాధ్యులు ప్రభాకర్, పోలూరి సనత్ కుమార్, రాగి సురేష్, మహబూబ్ అలీ, ఊరుకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్ల భూములు పేదలకు కేటాయించాలి

**సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ డిమాండ్.**

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 24
(తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల పార్కు పరిసర ప్రాంతాల్లో ఇళ్ల కూల్చివేతలను సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తీవ్రంగా ఖండించింది.గత పది హేనేళ్లుగా నివసిస్తున్న పేదలను బలవంతంగా బయటకు పంపించడం అన్యాయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ..ప్రజా పాలన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వ అధికారులు, పోలీసు బలగాలను ఉపయోగించి పేదలను ఖాళీ చేయించడం తగదని తెలిపారు. పేదల పక్షాన నిలబడిన కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయడం సరికాదని విమర్శించారు.వెలుగుమట్ల ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు అక్కడే స్థలాలను కేటాయించి, నివాస హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల కూల్చివేతలను తక్షణమే నిలిపివేసి, పోలీసు బలగాలు,అధికారులు ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని కోరారు.పేదల సమస్యలను పరిష్కరించకుండా బలవంతపు చర్యలు తీసుకోవడం వల్ల ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని పార్టీ నాయకులు హెచ్చరించారు.




## కాకరవాయిలో డ్రైనేజీ అభివృద్ధి పనులు వేగవంతం

- అవసరమైన చోట మ్యాన్ హోల్స్ ఏర్పాట్లు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు)

జిల్లాలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ గూడూరు ఉపేందర్ పేర్కొన్నారు..

తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో పారిశుధ్య వ్యవస్థ బలోపేతానికి విస్తృత స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయి. గ్రామంలో ఎక్కడా మురికినీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా మెరుగుపరచేందుకు సర్పంచ్ గూడూరు ఉపేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని వార్డుల్లో



సైడ్ కాలువలను గుర్తించి దశల వారీగా శుభ్రపరిచే పనులు కొనసాగుతున్నాయన్నారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తను పూర్తిగా తొలగించి నీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకుంటున్నామని. వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా ముందస్తు జాగ్రత్తగా డ్రైనేజీ మార్గాలను సరిచేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా సైడ్ కాలువలపై మ్యాన్ హోల్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని, అవసరమైన చోట్ల కొత్త మ్యాన్ హోల్స్ నిర్మించి, పాతవి దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మత్తులు చేపడుతున్నామన్నారు. దీనివల్ల కాలువల పరిశుభ్రతను సులభంగా నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో అడ్డంకులు తలెత్తకుండా చూడగలుగుతు, డ్రైనేజీ లైన్లను పరిశీలించడం, శుభ్రపరచడం మరింత సులభం అవుతుందని ఆయన తెలిపారు.గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడితేనే ప్రజల ఆరోగ్యం కాపాడబడుతుందని భావించి ప్రత్యేక శ్రద్ధతో పనులు కొనసాగుతున్నాయని. దోమల వ్యాప్తి, దుర్వాసన, వ్యాధుల సమస్యలు తగ్గేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు.కాకరవాయి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డ్రైనేజీ వ్యవస్థను శాశ్వతంగా బలోపేతం చేయాలని సంకల్పంతో ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు.





## ఉపవాసాల లక్ష్యం దైవభీతి

ఖమ్మం బ్యూరో , ఫిబ్రవరి 24(తెలంగాణ ముచ్చట్లు)

ఉపవాసాల లక్ష్యం దైవభీతి , తద్వారా మానవులలో నైతిక విలువల ప్రవర్తన తీర్చిదిద్దడం అని జమా ఆతే ఇస్లామీ హింద్ జిల్లా మహిళా పబ్లిక్ రిలేషన్ కన్వీనర్ హాజీరా సదఫ్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం లో రాపర్తి నగర్ లో ఉన్న తెలంగాణ మైనారిటీ ఖమ్మం గర్ల్స్ కాలేజీ లో విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ దైవభీతి జనింప చేసి నైతిక ప్రవర్తన తీసుకు రావడమే ఉపవాసం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆన్నారు. ఉపవాసం అనేది అన్ని మతాల వారు ఆచరిస్తారని అన్నారు. ఉపవాసం పాటించినప్పుడే మనిషిలో దైవభీతి నిగ్రహ శక్తి , సహనం పెరగడం తో పాటు మనిషికి అకలి భాధ తెలుస్తుందని అన్నారు ఇతరుల ఆకలి బాదను ఆర్ధం చేసికోగల్గుతాడన్నారు. ఉపవాసం మనిషిని సంస్కరిస్తుందని , సంస్కారమైన వ్యక్తుల ద్వారానే సత్సమాజం ఏర్పడుతుందన్నారు, కాబట్టి ప్రతి ఉపవాసి మనోవాంచలకు దూరంగా వుడడంతో పాటు సమాజంలో మంచిని పెంచి , చెడును పారద్రోలే ప్రయత్నం చేయాలన్నారు. అంతిమ దైవ గ్రంథమైన ఖుర్అన్ అవతరించడం వల్లనే ఈ రంజాన్ నెలకు ఇంతటి ప్రాధన్యత చేకూరిందని , ఇది సమస్త మానవాళికి మార్గదర్శకమన్నారు. ఉపవాసం వల్ల శాస్త్రీయంగా లాభాలను గురించి వివరించారు అనంతరం కోకన్వీనర్ జహీరా ఫాతియా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు.కొత్త విషయాలు కంటే చదివిన వాటిని పదేపదే రివిజన్ చేయటం వల్ల గుర్తుండటం సులభతరం అవుతుందని అన్నారు ఆత్మవిశ్వాసంతో పరీక్షకు సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించి మైనార్టీ గురుకుల కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్ , సభ్యులు నస్రీన్, సుమయ్య తరున్నం , కళాశాల ప్రిన్సిపాల్ అఖిల , ఉపాధ్యాయులు , విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?



**భూదాన్ భూముల్లో ప్రభుత్వ చర్యను ఖండించిన ఎంపీ రవిచంద్ర**

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి, 24
(తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం నగర శివారులోని భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చి వేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండిచారు. అక్కడ నివాసముంటున్న సుమారు 600 పేద కుటుంబాలపై వందలాది మంది పోలీసులు, పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లతో తెల్లవారు జామున్నే దాడి చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ నేతలు.. పేదల ఇల్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకుపడటం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. గుడిసెల తొలగింపును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై నిజంగా సానుభూతి ఉంటే తక్షణమే అక్కడి అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మళ్లీ బాలయ్య–పూరీ కాంబోలో సినిమా రాబోతుందా?

తెలుగు చిత్రసీమలో మాస్ ఇమేజ్‌కు ప్రతీకగా నిలిచిన నందమూరి బాలకృష్ణ, డాషింగ్ దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో మరోసారి చేతులు కలపబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, ఈ కాంబినేషన్ మళ్లీ తెరపైకి రానుందన్న ప్రచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన పైసా వసూల్ చిత్రానికి మిశ్రమ స్పందన లభించినప్పటికీ, బాలకృష్ణను స్టైలిష్‌గా, విభిన్న కోణంలో చూపించడంలో పూరీ విజయవంతమయ్యారని అప్పట్లోనే విశ్లేషకులు పేర్కొన్నారు. ఆ చిత్రం తర్వాత ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందనే చర్చలు కూడా వినిపించాయి. ఇప్పుడు ఆ అనుబంధమే మరో చిత్రానికి దారితీస్తుందా అన్నది ప్రశ్నగా మారింది. ప్రస్తుతం పూరీ ఫామ్‌లో లేకపోయినా, ఆయన ప్రత్యేకమైన నిర్మాణ శైలి, బలమైన పాత్రల రూపకల్పనపై బాలకృష్ణ నమ్మకం ఉంచినట్లు సమాచారం. సరైన కథ దొరికితే పూరీతో మళ్లీ పనిచేయడానికి బాలయ్య సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ధృవీకరణ ఇంకా రాలేదు. ఇటీవలి కాలంలో అఖండ విజయంతో బాలకృష్ణ కెరీర్ కొత్త ఊపును అందుకుంది. యువ దర్శకులతో కలిసి తన ఇమేజ్‌కు తగ్గ కథలను ఎంచుకోవడం ఆయన విజయాలకు ప్రధాన కారణమైంది. దర్శకుడి పేరు కంటే కథలోని కొత్తదనం, పాత్ర బలానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పూరీ జగన్నాథ్ విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం విజయ్ సేతుపతితో ఓ కొత్త చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. చాలా కాలంగా సరైన విజయాన్ని ఎదురుచూస్తున్న పూరీ, ఈ ప్రాజెక్ట్‌తో మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం విజయం సాధిస్తే బాలయ్య-పూరీ కలయికకు మరింత బలం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తానికి, బాలకృష్ణ-పూరీ జగన్నాథ్ కాంబినేషన్ మళ్లీ పునరావృతం అవుతుందన్న వార్తలు అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నాయి. అధికారిక ప్రకటన వెలువడితేనే పూర్తి స్పష్టత రానుంది. నిజమైతే మాస్ అంశాలతో కూడిన మరో శక్తివంతమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడం ఖాయమని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# రెండు సినిమాలు నిరాశపరిచినా.. కోటి రూపాయలు వసూలు చేస్తున్న హీరోయిన్..

తెలుగు చిత్రసీమలో కథానాయికల మధ్య పోటీ రోజు రోజుకూ తీవ్రంగా మారుతోంది. సీనియర్ తారలు క్రమంగా తగ్గిపోతుండగా, కొత్త తరం కథానాయికలు తమ స్థానాన్ని బలపరచుకునేందుకు పోటీ పడుతున్నారు. ఒకటి రెండు విజయాలు సాధించగానే భారీగా పారితోషికాలు పెంచడం ఇప్పుడు సాధారణంగా మారింది. అయితే కొన్ని సందర్భాల్లో చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా, మార్కెట్‌లో ఉన్న క్రేజ్ ఆధారంగా పారితోషికం తగ్గించకుండా డిమాండ్ చేస్తున్న కథానాయికలూ ఉన్నారు. ప్రస్తుతం అలాంటి చర్చలకు కారణమైన పేరు కాయదు లోహర్. ప్రస్తుతం ఆమె నాని సరసన తెరకెక్కుతున్న ది ప్యారడైజ్ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రం భారీ స్థాయిలో రూపొందుతోందని సమాచారం. అదనంగా మరో రెండు మధ్యస్థాయి చిత్రాలకు కూడా ఆమె అంగీకరించినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఒక్కో సినిమాకు సుమారు ఒక కోటి రూపాయల వరకు పారితోషికం తీసుకుంటోందనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది. అధికారికంగా ఎలాంటి ప్రకటన లేకపోయినా, ఈ మొత్తం తెలుగు చిత్రసీమలో చర్చనీయాంశంగా మారింది. విశ్వక్ సేన్తో కలిసి చేసిన మరో చిత్రం కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేక పోయింది. అయినప్పటికీ ఆమెకు అవకాశాలు తగ్గలేదు. అయితే కాయదు లోహర్ కెరీర్‌కు మలుపు తిప్పింది డ్రాగన్ చిత్రం. ఆ చిత్రం భారీ విజయాన్ని అందుకోవడంతో దక్షిణ చిత్రసీమలో ఆమె పేరు మారుమోగింది. అదే విజయంతో ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చాయని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక ప్రాంతంలో వచ్చిన విజయం, మరొక భాషలో అవకాశాలకు దారితీయడం ప్రస్తుతం సాధారణంగా మారింది. కాయదు విషయంలోనూ అదే జరిగిందని పరిశ్రమ వర్గాల అభిప్రాయం. ఇటీవలి కాలంలో కథానాయికల మార్కెట్ పూర్తిగా మారిపోయింది. చిత్ర విజయాల్లో కథానాయికల పాత్ర కూడా కీలకమవుతోంది. సామాజిక మాధ్యమాల్లో వారి ప్రభావం, అభిమాన వర్గాల స్పందన, ప్రచార కార్యక్రమాల్లో చురుకుదనం ఇవి కలిసి వారి పారితోషికాన్ని నిర్ణయిస్తున్నాయి. కాయదు లోహర్ విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తానికి, రెండు తెలుగు చిత్రాలు పెద్దగా విజయాన్ని అందుకోకపోయినా, మార్కెట్‌లో ఉన్న క్రేజ్, ఇతర భాషల్లో వచ్చిన విజయం ఆధారంగా కాయదు లోహర్ తన పారితోషికాన్ని కోటి రూపాయల స్థాయికి తీసుకెళ్లిందనే వార్తలు ఇప్పుడు తెలుగు చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారాయి. రాబోయే చిత్రాలు విజయవంతమైతే ఆమె స్థానం మరింత బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


# ఈ జాబిలి అందం చూస్తే చందమామే చిన్నబోతుందేమో!





తెలుగు చిత్రసీమకు కొత్త వెలుగులా పరిచయమైన యువ నటి శ్రీదేవి అప్పల్ల ప్రస్తుతం అభిమానుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. సామాజిక మాధ్యమాల్లో చిన్న చిన్న వినోద దృశ్యాలతో గుర్తింపు పొందిన ఆమె, తన సహజ నటనతో వెండితెరపై అడుగుపెట్టి మొదటి చిత్రంతోనే మంచి పేరు తెచ్చుకోవడం విశేషం. అందం, అమాయకత్వం, భావ వ్యక్తీకరణ ఇవి కలిసి ఆమెను యువతకు దగ్గర చేశాయి. కోర్టు చిత్రంలో జాబిలి పాత్రలో నటించి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ఆ పాత్రలో ఆమె చూపించిన నిరాడంబరమైన నటన, మృదువైన సంభాషణ శైలి, కన్నుల్లో మెరిసిన అమాయక భావం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఆమె పాత్రను ఎంతో ఆదరించారు. ఒక్క సినిమాతోనే మంచి పేరు సంపాదించి, యువ కథానాయికల జాబితాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. ఆ చిత్రం విజయంతో శ్రీదేవి అప్పల్లకు వరుస అవకాశాలు లభించాయి. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు మూడు చిత్రాలు ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే హైకూ అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో ఆమె విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. అదనంగా 'కోర్టు' చిత్రంలోని హీరో సరసన బ్యాండ్ మేళం అనే మరో చిత్రంలో కూడా నటిస్తోంది. ఈ చిత్రంలో ఆమె పాత్ర మరింత ఉత్సాహభరితంగా, వినోదాత్మకంగా ఉండనుందని చిత్రబృందం చెబుతోంది. సినిమాలకే పరిమితం కాకుండా, సామాజిక మాధ్యమాల్లో కూడా ఆమె చురుకైన పాత్ర పోషిస్తోంది. తరచూ అభిమానులతో మమేకమవుతూ తన చిత్రాలు, వీడియోలు పంచుకుంటోంది. తాజాగా లేత గులాబీ రంగు లెహెంగాలో ఆమె పంచుకున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి. ఆ చిత్రాల్లో ఆమె అందం మరింత మెరిసిపోతూ, నిజంగానే జాబిలి భూమిపై దిగివచ్చినట్లుగా ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. యువ కథానాయికల మధ్య పోటీ పెరుగుతున్న ఈ సమయంలో, సరైన కథల ఎంపికతో ముందుకు సాగితే శ్రీదేవి అప్పల్లకు తెలుగు చిత్రసీమలో మంచి భవిష్యత్తు ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి అడుగులోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ జాబిలి, రాబోయే చిత్రాలతో తన ప్రతిభను మరింత చాటుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఆ హీరో వల్లే నా జీవితం మారిపోయింది.. భావోద్వేగానికి లోనైన మృణాల్ ఠాకూర్



బాలీవుడ్ నుంచి తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టి తొలి చిత్రంతోనే విశేష గుర్తింపు పొందిన నటీమణుల్లో మృణాల్ ఠాకూర్ ఒకరు. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కించిన సీతారామం చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఆ చిత్ర విజయంతో పాటు తన నటనతో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. అందం, భావవ్యక్తీకరణ, సహజ నటనతో యువ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'సీతారామం' అనంతరం ఆమె నటించిన హాయ్ నాన్న కూడా విజయాన్ని అందుకోవడంతో మృణాల్ తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయికగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమయ్యాయి. అయితే అనంతరం విజయ్ దేవరకొండతో కలిసి చేసిన ఫ్యామిలీ స్టార్ ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో ఆమె సినీ ప్రయాణం కొంత మందగించింది. ఆ తర్వాత ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడిలో ప్రత్యేక పాత్రలో కనిపించింది. ప్రస్తుతం 'డెకాయిట్' అనే చిత్రంలో నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉండగా, తాజాగా మృణాల్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తన జీవితంలో ఒక ప్రముఖ హీరో చెప్పిన మాటలు ఎంతో మార్పు తీసుకువచ్చాయని ఆమె భావోద్వేగంగా వెల్లడించింది. ఆ హీరో మరెవరో కాదు అక్షయ్ కుమార్. గతంలో తన శరీరాకృతి పై వచ్చిన విమర్శల వల్ల తీవ్రంగా బాధపడ్డానని, కొన్ని సందర్భాల్లో కన్నీళ్లు పెట్టుకున్నానని మృణాల్ తెలిపింది. ఆ విమర్శలు తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయని, ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని చెప్పింది. అలాంటి సమయంలో అక్షయ్ కుమార్ తనకు ఇచ్చిన సలహా జీవితాన్ని మార్చిందని మృణాల్ వెల్లడించింది. "నిన్ను నువ్వుగా అంగీకరించు. ఇతరుల కోసం మారాల్సిన అవసరం లేదు. ఒక పాత్ర కోసం అవసరమైతే మాత్రమే మార్పు చేసుకో" అన్న ఆయన మాటలు తనకు కొత్త ధైర్యాన్ని ఇచ్చాయని తెలిపింది. అప్పటి నుంచి తనకు నచ్చిన విధంగా, సంతోషంగా జీవించేందుకు ప్రయత్నిస్తున్నానని, విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగుతున్నానని మృణాల్ పేర్కొంది. సినీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, విమర్శలు సహజమే అయినప్పటికీ, వాటిని ధైర్యంగా ఎదుర్కోనడం ముఖ్యమని మృణాల్ సందేశం ఇస్తోంది. తన ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in